


# మనసుగల మనిషి

జి.వి. సాయికుమారి

ఇప్పటికీ అతను గుర్తుకొస్తే కన్నీరు పెట్టుకొంటుంది ఆమె. ఆ కన్నీటి చారలవెనక మసగ్గా అతను నించుని నవ్వుతున్నట్టూ భ్రాంతిపడుతూ వుంటుంది

అతన్నిచూసి దరిదాపు పదేళ్ళవుతుంది. ఈ పది సంవత్సరాల్లోనూ అతనిగురించి ఏమీ తెలియ లేదు. అంతమాత్రంచేత తనగుండెల్లోంచి అతన్ని చెరపివేయనూ లేదు.

కానీ ఆ రోజు...

* * *

— సాయంత్రం అయిదున్నర గంటలవేళ అరవింద కాలేజినుండి ఇంటికొచ్చింది. తిన్నగా మేడమీదకెళ్ళి టేబిల్‌మీద బుక్స్ పడేసి వరండాలోకి వచ్చింది.

అక్కడ మధుమతి కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుతోంది. అరవింద కొన్ని క్షణాలు మధువంక చూస్తూ వుండిపోయింది అప్పుడే మధు తలెత్తి చూసి.

"ఏం అక్కా ఎంతసేపయింది నువ్వొచ్చి." అడిగింది.

ఇప్పుడే' అన్నట్టు భాస్కర్ వచ్చేడా?"

"రాలేదింకా."

"మధూ ఈ రోజునుండీ నువ్వు భాస్కర్‌తో మాట్లాడ్డానికి వీల్లేదు "

"ఏం?" ఆశ్చర్యపోయింది మధుమతి.

'మన కాలేజీల్లో మేడమెట్లదగ్గర శశి మాటలు విన్నాను."

"అక్కా."

"అవును. శశి అంత దారుణంగా మాట్లాడుతుందనుకోలేదు. రోజూ నీకు ఎవరో సంపెంగ పువ్వు తెచ్చిస్తారటగదూ? అని రాధ అడగటం. 'అవును - చాలా కావల్సినవారే" అని శశి అనడం. నువ్వు తమాయకురాలివి. పైగా అంత తెలివితక్కువగా సమాధానం చెప్పేది?

'అవును - భాస్కర్ మా అన్నయ్య ఫ్రెండ్. చాలా మంచివాడు, నన్నొక్కరోజు చూడకుండా వుండలేడు" అన్నాను. 'ఆ మాటకి అందరూ నవ్వేశారు".

'అంతా నేను విన్నాను. వాళ్ళంతా అలా ఎందుకు నవ్వేరంటావ్?" అడిగింది అరవింద

"వాళ్ళెవరికీ భాస్కర్ అన్నయ్య లాటి అన్నయ్యలు లేకపోవచ్చు అ కుళ్ళు బయటపెట్టలేక నవ్వేసి వుంటారు".

'అదిసరే-శశికి నువ్వు భాస్కర్‌ని అన్నయ్య'. అంటావని తెలుసా?"

'అదేమిటి పిచ్చక్కయ్య శశి వుండేది మనింటికెదురేకదా? ఎన్నోసార్లు విన్నది అయినా ఎందుకలా అడుగుతున్నావ్'.

'మరంత తెలుసుండేనా అలా నీచంగా ప్రచారం చేస్తోంది'.

"ఏమనక్కా".

"పిచ్చిదానా! అర్థం చేసుకొనేంతగా నువ్వు పెరగలేదు. లోకం అంటే తెలీని పసిదానివి. నీ మనసు మంచిదని లోకం అంతా మంచిదే అనుకుంటున్నావు. మీ శశికి కనీసం మన అమ్మమ్మకున్న సంస్కారంలో పాతికోవంతు వున్నా బావుండేది! అసలు సంగతి చెబుతున్నా వినుమధూ శశి- నీ గురించి. భాస్కర్ గురించి ఓ ప్రేమకథ నల్లి ప్రచారంలో పెట్టింది.

-మనం ఎంతమంచివాళ్ళంఅన్నా కావచ్చు కానీ- లోకానికి కావల్సింది వాళ్ళకి కాని విషయాలు. ప్రచారం చేయడం. ఇది ఇంట్లో తెలిస్తే ఎంత అసహ్యంగా వుంటుందో ఆలోచించు' అంటూ మేడ దిగి వెళ్ళిపోయింది అరవింద.

నిర్మలమైన మనసు మధుమతిది.

ప్రతివారూ అంతే అనుకొంటుంది. అరవింద మాటలు మధుమీద ఒక రియాక్షన్ లాటిది కలిగింది.

కళ్ళవెంట కన్నీరు జారింది.

పవిటతో కన్నీటిని తుడుచుకొంది మధు.

"ఇందులో నేను చేసిన తప్పేమేనా వుందా?" అనుకొంది మధు.

రోజు రోజుకూ పెరిగిపోతున్న మన నాగరికతకు ఇదొక చక్కని ఉదాహరణ. విద్యవల్ల అజ్ఞానం పోయి విజ్ఞానం నేర్చుకొనే కాలేజీలలోగల సంస్కారమది. మనసు సంకుచితం అయితే మనిషి తాను బతకలేడు-ఇతర్లు సుఖంగా బతకడం అతనికిష్టం వుండదు.

మధుమతికి కాస్సేపు తోటలో కూర్చుందామని పించింది. మెల్లగా మేడమెట్లు దిగుతుండగా అరికాలి క్రింద ఏదో నలిగినట్టయింది. అది ఒక సంపెంగ పువ్వు.

కాలి తాకిడికి నలిగి పసరుగొన్నది.

మధు మెల్లగా వంగి దానిని చేతుల్లోకి తీసుకుంది. కళ్ళనుండి రెండు కన్నీటిబొట్లు రాలి పడ్డాయి.

"భాస్కర్ వెళ్ళిపోయాడు." గుమ్మంలో నించున్న అరవిందతో బాధగా చెప్పింది మధుమతి.

"అవును అతను మన మాటలు విన్నాడు." అన్నది అరవింద.

* * *

— .........

ఇది నా కథ. రాస్తున్నాను.

మధూ! నీకు నా మంజూ గురించి ఎప్పుడూ చెప్పలేదు. కారణం చెప్పకూడదనుకొన్నాను.

మంజు నా చెల్లెలు. అదంటే నాకు ప్రాణం. రెండేళ్ళ క్రితం అది స్కూల్‌ఫైనల్ పరీక్ష రాసి ఇంటికొచ్చింది. ఆ రోజుతో దాని చరిత్ర ముగుస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు ఎక్కడున్నాడో దాపురించిందో గాని కాలసర్పం కాటు వేసింది అంతే. మంజు ఆ తర్వాత నన్నొదిలిపోయింది. రోజులు యాంత్రికంగా గడిచిపోతున్న సమయంలో నా చిన్ననాటి స్నేహితుడు మీ అన్నయ్య బలరాం ఆహ్వానించేడు. అతనితో మీ ఇంటికొచ్చేన్నేను. నేనూ బలరాం మాట్లాడుకొంటుండగా నువ్వు హాస్టల్‌నుంచి ఇంటికొచ్చేవు.

అంతే నేను స్తంభించి పోయాను.

మూర్తీభవించిన మంజూనే

అదే కళ్ళు, అదే ముఖం, అలాగే గడ్డంకింద పుట్టుమచ్చ.

"మంజూ" అన్నాను.

"మంజూ కాదు మధు" అన్నాడు బలరాం.

"ఒకసారి పిలవ్వా అడిగేను

బలరాం నవ్వుతూ నిన్ను పిలిచాడు.

నువ్వొచ్చి నమస్కారంచేసి నించున్నావు.

"నీ పేరేమిటమ్మా చెలీ" అన్నాను.

"మధుమతన్నయ్యా"

ఆ రోజునుండి నాలో కొత్త ఆశలు కలిగేయి. మంజూ సంపెంగ అంటె ప్రాణం పెడుతుంది.

అందుకే నీకు ప్రతిరోజూ ఆ పువ్వు తెచ్చివ్వడం.

కానీ మధూ

నావల్ల నీ కొచ్చిన నిందకి ఘోరమని పిస్తోంది. నీ మీద ఈగవాలినా సహించలేను నేను.

నీ సన్నిధిలో మంజూను మరచి మామూలు మనిషి నయ్యాను. కానీ దురదృష్టవంతుణ్ణి.

నే నిక్కడే వుంటే నిన్ను చూడకుండా వుండలేను. అందుకే చాలా దూరం పోతున్నాను. ఎక్కడవున్నా నీ పెళ్ళికిమాత్రం తప్పకుండా వస్తాను. నన్ను క్షమించు.

నీ అన్నయ్య.

భాస్కర్.

...కళ్ళవెంట రెండు కన్నీటిబొట్లు రాలేయి. మౌనంగా ఆ వుత్తరాన్ని అరవిందచేతి కిచ్చింది.

* * *

...పెళ్ళిపందిరి రంగుదీపాలతో కళకళలాడుతోంది పెళ్ళిపీటలమీద కూర్చునున్న మధుమతి నిముష నిముషం తలయెత్తి చుట్టూ కలయజూస్తోంది.

పురోహితులుచెప్పే పూజలుచేస్తూ అటూ ఇటూ చూస్తోంది. ఒక్కసారిగా ఆమె ముఖంలో వెయ్యి క్యాండిల్ బల్బులా కాంతి కనబడింది దూరంగా భాస్కర్. మాసిన గడ్డం, దుబ్బు జుట్టు, మాసిన బట్టలు. ఎలా వున్నా, ఎంతమందిలో వున్నా గుర్తుపట్టగలదు.

అప్పుడే భాస్కర్ బయటకు వెళ్ళిపోతుండడం గమనించింది మధుమతి.

"వదినా ఒకసారి అన్నయ్యని పిలుస్తావూ?" అడిగింది ఏదో పళ్ళెం ఇచ్చి వెళుతున్న వదినతో ఆత్రుతగా.

తన దగరకు రాబోతున్న బలరాం, ఇంతలో ఎవరో పిలిస్తే అటుగా వెళ్ళిపోయాడు.

మధు నిట్టూర్చింది. బాధగా దృష్టిని పూజమీదుంచింది.

పెళ్ళయిపోయింది.

వధూవరులు ఇంకా పీటలమీదే వున్నారు.

భాస్కర్ దూరంగా వున్న గది అరుగు మీద కూర్చుని చేతిలో వున్న ఎర్రరాయి వుంగరాన్ని చూసుకొని తృప్తిగా నవ్వుకొన్నాడు. తన చేతులతో మధుచేతివేలికి ఆ వుంగరాన్ని పెట్టాలి అనుకొన్నాడు. కానీ అంత మందిలో వెళ్ళి ఆ బహుమతి నివ్వడానికి సంశయించేడు.

అదే సమయంలో —

"అన్నయ్యా" అంటూ అరవింద మరది పన్నెండేళ్ళవాడు అరవింద భర్త దగ్గరకి పరుగెత్తుకొచ్చాడు.

"ఏమిట్రా" విసుగా అన్నాడు శేఖరం.

"అన్నయ్యా! నీ వుంగరం ఏదీ" అడిగేడు.

చేతివేలికి చూసుకొని "అరేఏది! ఆశ్చర్యంగా వుందే!" అన్నాడు.

"ఆ వుంగరం అరుగు మీదున్న పిచ్చబ్బాయి దగ్గరుంది మరందుకేగా నీకు చెప్పింది" అన్నాడు.

శేఖరం గబగబా అరుగుమీది కొచ్చేడు. అప్పుడు

## మూర్ఛకు కొత్త వైద్యం

మూర్ఛ వ్యాధితో బాధపడే రోగులకిప్పుడు వారి శరీరంలోనేవుండే శక్తినిల్వ పదార్థంతోనే విజయవంతంగా చికిత్స చేయబడుతోంది. ఆ పదార్థాన్నే ఎడినోసిన్ ట్రైఫోస్ఫారిక్‌యాసిడ్ (ఎ, టి. .ఎ) అంటారు.

పదేళ్ళక్రితమే నాడీకణాలలో ఆమ్లజని సంయోగ క్రమ విధానాలు సరిగా పనిచేయకపోవడం మూలంగానే మూర్ఛ వస్తుందని సూచించబడింది. దీనినిఅధిగమించడానికిగాను ఒడెస్సా వైద్యసంస్థలో పనిచేసే కాన్‌స్తాంతిన్ మొస్కెతి యీ ఎ. టి. ఎ ను రక్తనాళంలోకి ఇంజక్టు చేయాలని సూచించారు.

1966 లో ఆయన డాక్టరేటు పట్టాకోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసంలో యీ సూచనచేశారు. మొదట ప్రయోగశాలలోనూ, ఆ తరువాత వైద్యశాలల్లోనూ ఆయన దానిని పరీక్షించారు.

ఒక సందర్భంలో తీవ్రమైన ఫిట్స్ వస్తూన్న ఒక యువతికి యీ ఇంజక్షన్ యిస్తే అయిదు నిమిషాలలో కోలుకుంది.

ఇప్పుడీపద్ధతి చికిత్స కీవ్, లెనిన్‌గ్రాడ్, మాస్కోనగరాలలోని వైద్యశాలల్లో చేయబడుతోంది. చాలామంచి ఫలితాలు కనిపిస్తున్నాయి.

ఈ మందు యింత త్వరగా పనిచేస్తూండడాన్ని బట్టిచూస్తే మూర్ఛవ్యాధి నాడీ కణాలలోని ఆమ్లజని సంయోగ క్రమవిధానం పనిచేయకపోవడంమూలంగానే సంభవిస్తుందనే సిద్ధాంతం సరి అయినదేనని రుజువవుతోంది.

భాస్కర్ ఆ వుంగరాన్ని చూసుకొంటున్నాడు పరీక్షగా. శేఖరం గబాల్న ఆ వుంగరం లాక్కుని.

'దొంగ రాస్కెల్. పండడిగా వుండిగదావి దొంగతనం చేస్తావా ?" అన్నాడు.

"అది నాదిబాబూ" అన్నాడు భాస్కర్.

"ఆయ్ ఇంకా పేలావంటే బాదేస్తాను గెటవుట్ రాస్కెల్" అన్నాడు.

చుట్టూ చేరిన మనుషులు 'వూరుకోండి శుభ సమయంలో పిచ్చి వెధవని కొట్టటం ఎందుకు. పోనీండి" అన్నారు.

'అదే మరో సమయం అయుంటే జైలుకెళ్ళే వాడివి పో" అన్నాడు శేఖర్.

— 'పెళ్ళికూతురుగారేమంటున్నారు?" హాస్యం చేసాడు శేఖరం.

తలవంచుకొని చిన్నగానవ్వి 'రే బావగారు మీ రింగ్ యిచ్చేశానా" అన్నది ఆశ్చర్యంగా.

'రింగ్ ఇవ్వడం ఏమిటి?"

"అయ్యో! అప్పుడే మర్చిపోయారా! ప్రొద్దున పని హడావడిలో వుండగా మీ దగ్గర తీసుకున్నాను. పైగా నాకిస్తూ పెళ్ళి కూతురి దగ్గర వస్తువులు జాగ్రత్తగా వుంటాయట అన్నారుకూడ" అంటూ బీరువాలో చూపింది. అక్కడో ఎర్రరాయి వుంగరం.

'అయితే ఇది నాది కాదన్నమాట. పాపం నా మతిమరుపువల్ల ఆ అబ్బాయిదిగ్గర లాక్కుని నానా మాటలూ అని తరిమేశాం."

"ఏ అబ్బాయివి?"

"అదే పిచ్చోళ్ళా వున్నాడు గడ్డం, దుబ్బుజుట్టు"

"మాసిన తెల్లచొక్కా అతనేనా?"

"అవును, అతను నీకెలా తెలుసు?"

"అతనువెళ్ళిపోయాడా?" ప్రశ్నలు కురిపిస్తోంది.

"వెళ్ళి [illegible]"

"ఎవరే అది?" అరవింద అడిగింది.

"అక్కా భాస్కరన్నయ్యక్కా. వెళ్ళిపోయాడక్కా. దొంగగా అవమానింపబడి వెళ్ళిపోయాడు" ఏడవసాగింది మధుమతి.

'భాస్కరన్నయ్యా ! ఎవరతను? నాకు తెలీదే ?"

'అబ్బ మీకేం తెలీదు వూరుకోండి" అన్నది అరవింద.

'తప్పమ్మా పెళ్ళికూతురు కంటతడి పెట కూడదు. భాస్కర్ ఎక్కడున్నా నేను తీసుకొస్తాను." అన్నాడు బలరాం.

* * *

చెల్లీ ! ఆశీస్సులు.

నీ పెళ్ళికి వస్తానన్నాను. ఇచ్చిన మాట నిలుపుకున్నాను.

పెళ్ళిపీటలమీద నువ్వు ఓ దేవతలా వెలిగిపోతుంటే సంబరపడిపోయాను.

నీ పెళ్ళి కానుకగా అందమైన ఉంగరాన్ని తెచ్చాను. నా చేతులతో దాన్ని నీ వేలికి తొడగాలనుకొన్నాను. కానీ!...

దొంగగా అనుమానింపబడిన దౌర్భాగ్యుడిని. నేను దొంగని కాను మధూ. నీకోసం తెచ్చాను అంతే కానీ అక్కడ నమ్మేదెవరు! ఆ స్థితిలో మీ కళ్ళబడడం ఇష్టంలేక వెళ్ళిపోయాను కలవ్ ఇకముందు కూడా మికెవ్వరికీ కనబడను. అందుకు ప్రయత్నం కూడా చేయకు

నీ
అన్నయ్య
భాస్కర్.

మధుమతి అది చదివి వెక్కి వెక్కి ఏడ్చింది తర్వాత బలరాం చెప్పగా విన్నది మధుమతి.

భాస్కర్ మిలటరీలో సెకండ్ లెఫ్టినెంట్‌గా చేరి నట్టు. అప్పుడు మరింత బాధపడింది.

ఇప్పుడామెకి ఇద్దరు యువరాజులు-ఒక యువరాణి వున్నారు పెద్దవాడు భాస్కర్. చిన్నవాడు గోపాల్. యువరాణి-రాణియే.

* * *

పది సంవత్సరాలుగా మధుమతి అతని కోసం చూస్తూనేవుంది


కానీ భాస్కర్ ఎప్పుడూ రాలేదు.

కన్నీళ్ళు తుడుచుకొంటూ ఆ రోజు ఒక నిశ్చయానికి వచ్చేసింది

'ఇకముందుకూడా అతను రాడు."

అలా అనుకున్నప్పుడు రెండు కన్నీటి బొట్లు ఆమె చెక్కిళ్ళమీదుగా జారేయి.

★




# హాట్ డైమండ్స్

(14 వ పేజీ తరువాయి)

వస్నీ అమరస్తుంది(లోపల తిట్టుకుంటే మనకేం?)

## గురువాజ్ఞ

మీ శ్రీమతి తెచ్చిపెట్టమన్న వస్తువులు మీరు తీసికెళ్ళ(లే)ని రోజున, పొద్దున లేచి లేవగానే మీ శ్రీమతితో పోట్లాడిన రోజున ఈ చిట్కాలు వుపయోగించరాదు - వుపయోగించినా పనిచేయవు. యిది గురువాజ్ఞ.

నిజానికి యిలాటి చిట్కాలు చాలా వున్నాయి సార్...అవును. అదేమిటి. పుస్తకం చదువుతున్నవారు అలా వులిక్కిపడ్డారు...ఏమిటీ...మీ యింటిముందు రిక్షా ఆగిందా ... మీ శ్రీమతి వస్తోందా ?

మీకు అసలు విషయం చెప్పలేదు గురూగారూ! అసలు ఆడవాళ్ళంటే ఏమనుకున్నారు? ఎవరనుకున్నారు ?! వాళ్ళు డైమండ్స్‌లాటి వాళ్ళండి బాబూ! డైమండ్స్ అనగా వజ్రవైఢూర్యాదులు. ఎక్కడవున్నా ధమక్ ధమక్ తారల్లానే వుంటాయి. కాని వాటిని సూర్యుని ఎదుటకు తెస్తే... ఆ కాంతితో ఎంతో గొప్ప కాంతితో.. మిలమిల మెరుస్తాయి. అప్పుడు అలాగే మాంధి డైమండ్స్‌లాటి భార్యామణులు స్వతహాగానే అందంగా వుంటారు కోపమొచ్చినప్పుడు ఇంకా అందంగా వుంటారు (హాట్ డైమండ్స్‌లా) కాబట్టి మీకిష్టమైన అందంకోసం కోపాన్ని భరించక తప్పదుమరి.

యేమిటంటారుసార్... మీ శ్రీమతి మీ చేతిలో పుస్తకం లాక్కుని యీ వ్యాసం చూసేస్తున్నారా..

అయినా అదేంవనయ్యా పెద్దమనిషి ఆడకూతుర్ని ఒంటరిగా యింట్లోవదిలి రాత్రి పది పదకొండు గంటల్దాకా బజార్లంట తిరిగొస్తున్నారా! యింత వయసున్నవాడివి వేళకింటికొచ్చి పెళ్ళాం యిడమన్నట్టు తీర్చాలని తెలీదూ ?

★